క్లుప్తంగా

డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న నరసింహారావు

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం జూలూరుపాడుకు చెందిన నాయకుడు వేల్పుల నరసింహారావు శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. అధ్యక్ష పదవికి తన పేరును పరిశీలనలోకి తీసుకోవాలని ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహాంకు దరఖాస్తులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన

ఇల్లెందు: అందరూ విద్యనభ్యసించటం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. శుక్రవారం ఇల్లెందు బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన డే సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. కష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. కుటుంబం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్ధేశించుకుని సాధన చేయాలి

ఇల్లెందురూరల్: ప్రతీఒక్కరు విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధన చేస్తే సత్ఫలితాలు సాధిస్తారని కేరీర్ గైడెన్స్ గైడ్ పంజి జయపాల్ సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఆలిండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. పదో తరగతి తరువాత భవిష్యత్ చదువులపై సంపూర్ణ అవగాహన ఉండాలని, తాము ఎంచుకున్న లక్ష్యాన్ని తగినట్లు ఇష్టమైన కోర్సులను ఎంపిక చేసుకోవాలని చెప్పారు.

స్వీట్ షాపుల్లో తనిఖీ

పాల్వంచ: పట్టణంలోని శాస్త్రీరోడ్డులో పలు స్వీట్ షాపులను శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్, ఎనాలసిస్ ఆఫీసర్ రతన్ మూడు షాపులను, ఖార్కానాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని షాపుల్లో అపరిశుభ్రత, రసాయన పదార్థాలు వాడుతుండటంతో పాటు, నిబంధనలు పాటించని షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లో మళ్లీ తనిఖీ చేస్తామని, తీరు మారకపోతే దుకాణాలు మూసివేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం శ్రీదత్త నగర్‌లోని శ్రీ సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడ హారతి, మామిడి తోరణాలంకరణ, గణపతి పూజ, సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం, గోత్రనామార్చన పూజలను ఆలయ పూజారి శ్రీరామచంద్రమూర్తి శాస్త్రోయుక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, మంగమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై బాబాకు పూజలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

భయపెడుతున్నాయి.. దాడి చేస్తున్నాయి



- కోతుల బెడదతో జనం బెంబేలు
- నియంత్రణ పట్టని అధికారులు



వందల సంఖ్యలో సంచరిస్తున్న వానరాలు

ఇల్లెందురూరల్: పట్టణం నుంచి పల్లె వరకు కోతుల బెడద ప్రజలను ఇబ్బంది పెడుతోంది. నివాస ప్రాంతాల్లోనే తిష్ట వేస్తుండటంతో నిత్యం ఏదో ఓ చోట ప్రజలు వానరాల దాడిలో గాయపడుతున్నారు. కోతుల గుంపు భయంతో ఇంటి దర్వాజలకు, కిరాణ దుకాణాలకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసుకునే పరిస్థితి వచ్చిందంటే ప్రజల బాధలు అర్థం చేసుకోవచ్చు. వందల సంఖ్యలో కోతులు వీధుల లో తిరుగుతూ.. ఇళ్లను పీకి పందిరేస్తున్నాయి.

కాగితాలకే పరిమితమైన నియంత్రణ చర్యలు...

అడవులు తగ్గుముఖం పట్టడంతో వానరాలు గ్రామాలపై పడుతున్నాయి. ఊరూరా వానర సైన్యం క్రమంగా పెరిగిపోయి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా ఇళ్లపైకి వస్తున్నాయి. గ్రామాలలో గుంపులుగా సంచరిస్తూ ఆహారం దొరకక ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇళ్లల్లో చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. పండ్ల తోటలు, చేలను నాశనం చేస్తున్నాయి. తలుపు తెరిచి ఉంటే చాలు ఇంట్లోకి జొరబడి అందినదల్లా ఎత్తుకెళ్తున్నాయి. గృహోపకరణాలను ధ్వంసం చేస్తున్నాయి. ఆ సమయంలో అడ్డగించే ప్రయత్నం చేస్తే మనుషులపై కూడా దాడి చేసి గాయపరుస్తున్నాయి.

బయటకు వెళ్లాలంటే భయం..

ప్రస్తుతం గ్రామాల్లో వృద్ధులు, చిన్నారులు కాలినడకన బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర పట్టుకోక తప్పడం లేదు. ముఖ్యంగా వాకింగ్ చేసేవారిలో వయోభేదం లేకుండా చేతికర్రను వెంటపెట్టుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఏ వీధిలో చూసినా వానరాలే ఉండడంతో గమ్యం చేరుకునే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయం భయంగా రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఉంది. ఇక ఇంటి ఆరుబయట కూర్చోవాలంటే చేతిలో గుల్బర్ ఉండక తప్పడం లేదు. గతంలో కోతులను భయపెట్టేందుకు కొండముచ్చులను వీధుల్లో తిప్పేవారు కానీ, నేడు వాటికి కూడా కోతులు భయపడటం లేదు. దీంతో ప్రజలు కోతులను రక్షించుకునేందుకు కర్ర, గుల్బర్‌లను ప్రస్తుతం ఆయుధంగా వినియోగించక తప్పడం లేదు.

ఎవరికీ పట్టని జనం గోస..

హరితహారం పేరుతో దశాబ్దకాలంగా మొక్కలు విరివిగా నాటారు. అందులో ఒక శాతం పండ్ల మొక్కలను అడవుల్లో పెంచినా నేడు కోతులు తిరిగి అడవులకు వెళ్లేవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అక్కడక్కడ నాటినప్పటికీ వాటి ఆలనాపాలన ఎవరికీ పట్టకపోవడంతో మొక్క దశలోనే ఎండిపోయాయి. ఇదిలా ఉండగా గతంలో స్థానిక సంస్థలు కోతులను పట్టించే ప్రయత్నం చేశాయి. కానీ అవి సత్ఫలితాలనివ్వకపోవడం, ఖర్చు అధికంగా ఉండటంతో వారు కూడా కోతుల బెడదను పట్టించుకోవడం మానేశారు. కనీసం ప్రత్యామ్నాయ చర్యలకు కూడా ఉపక్రమించడం లేదు. దీంతో సమస్య రోజురోజుకు ఝటిలమవుతోంది. కోతులు ప్రజలపై దాడి చేయడం నిత్యకృత్యంగా మారింది. ప్రతీ గ్రామంలోనూ ఏదో ఒక వీధిలో కోతుల వల్ల గాయపడిన వారు ఒక్కరైనా ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు. ఆ స్థాయిలో కోతుల దాడులు కొనసాగుతున్నాయి. ఇక ఆస్పత్రులలో కోతుల వల్ల గాయపడిన వారి చిట్టా చాంతాడంత ఉంటోంది. వారికి చికిత్స చేయడం కూడా వైద్యశాఖకు భారంగా మారుతోంది.



మొక్కజొన్న చేలో మొక్కలు పీకుతున్న కోతులు

చేనుకు వెళ్తుంటే..



ఇంటి నుంచి చేనుకు వెళ్తుటే గ్రామ శివారులోనే కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి. పదికి పైగా కోతులు ఒక్కసారిగా మీదపడి గాయపరిచాయి. సమీపంలో ఉన్న ప్రజలు స్పందించడంతో ప్రాణాలతో బయటపడ్డా. అధికారులు చర్యలు తీసుకోవాలి. – ఎస్కే మౌలానా, క్యాంప్‌సెంటర్

ప్రాణాపాయం తప్పింది..



ఇంట్లో సరుకుల కోసం తెల్లవారుజామునే దుకాణం వద్దకు బయలుదేరాను. చెట్ల మీద ఉన్న కోతుల గుంపు ఒక్కసారిగా నాపై దూకి దాడిచేశాయి. ముఖంపై, చేతులు, వీపుపైనా గాయం చేశాయి. స్థానికులు కర్రలతో రావడంతో ప్రాణాపాయం తప్పింది.– బల్లెం అనసూర్య, 24ఏరియా, ఇల్లెందు

రేబిస్ సోకే అవకాశం..



కోతులు కరిస్తే రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. చర్మం దెబ్బతిని ఇన్ఫెక్షన్ల సమస్యకు దారి తీయొచ్చు. కోతి కరిచిన చోట గాయాన్ని 10 నిమిషాల పాటు సబ్బు, చల్లని నీటితో కడగాలి. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. – డాక్టర్ కవిత, రొంపేడు పీహెచ్‌సీ

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



పాల్వంచరూరల్: జోనల్ క్రీడలను ప్రారంభిస్తున్న ఏటీడీఓ చంద్రమోహన్



ఇల్లెందురూరల్: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఇల్లెందురూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఇల్లెందు ఏటీడీఓ భారతీదేవి అన్నారు. బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి ఎంపిక క్రీడలు శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఇల్లెందు సబ్‌డివిజన్‌లోని ఏడు ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీలల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్ అంశాలలో విద్యార్థులను జట్లుగా ఎంపిక చేసి వారి ప్రతిభను పరీక్షించారు. ఎంపికై న క్రీడాకారులు ఐటీడీఏ స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ క్రీడాధికారి గోపాలరావు, హెచ్‌ఎం నాగమణి, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గిరిజన విద్యార్థులు చదువులతోపాటు క్రీడలను ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రోత్సహిస్తున్నారని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏటీడీఓ చంద్రమోహన్ అన్నారు. కిన్నెరసానిలో రెండు రోజులు నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఏసీఎంఓ, కీసర రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సుజాతనగర్, జూలూరుపాడు, కొత్తగూడెం, చంద్రుగొండ, పాల్వంచ మండలాలకు చెందిన గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లకు చెందిన 210 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.70మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

భోజన వర్కర్లకు పెండింగ్ వేతనాలివ్వండి..

ఇల్లెందురూరల్: మధ్యాహ్న భోజన వర్కర్లకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్లు శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సుల్తానా, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు, బిల్లులు మంజూరు చేయకుండా నూతన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించడం వర్కర్లపై ఆర్థిక భారం మోపడమేనన్నారు. వంట గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేసి మెనూ చార్జీలను పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కుమారి, ఐలమ్మ, మల్లమ్మ, సరిత, పద్మ, రాణి, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

టేకులపల్లి: టేకులపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ హట్కర్ దేవా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టెర్మినల్ బెనిఫిట్స్ త్వరగా పూర్తి చేయండి..

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి కార్పొరేట్‌లోని అన్ని డిపార్ట్‌మెంట్లలో టెర్మినల్ బెనిఫిట్స్‌కు సంబంధించి క్లర్క్‌లతో శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో డీజీఎం (పర్సనల్) వెల్ఫేర్‌లు కేసా నారాయణరావు, ముకుంద సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. కారుణ్య నియామకాలు, సీఎంపీఎఫ్ క్లెయిమ్స్, పెన్షన్లు, గ్రాట్యుటీల సెటిల్‌మెంట్లు త్వరగా పూర్తి చేయాలని, సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డ్ వెంటనే అందేలా చూడాలన్నారు.

డ్రైవర్ల వేతనాలు పెంపు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్ల వేతనాలు పెంపు జరిగిందని, వాహన యజమానులకు, సింగరేణి యాజమాన్యంతో కుదిరిన ఒప్పందంలో నెలకు రూ.18వేలుగా నిర్ణయం తీసుకున్నట్లు ఏఐటీయూసీ రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం చర్చల్లో అంశాలను డ్రైవర్లకు వివరించారు. వాహన యజమానులు, డ్రైవర్ల అసోషియేషన్ నాయకులు క్రిష్టాఫర్, పి.రాజేష్, రాము, ప్రభాకర్, కే.రామానుజం, శ్రీనివాస్, నగేష్, సునిల్, మధుకుమార్, ప్రవీణ్, రామస్వామి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రామకృష్ణ, సతీష్, రెహమాన్, వంశీ, పూర్ణ, ముక్తర్ పాల్గొన్నారు.

'సీపీఆర్'పై అవగాహన పెంచుకోవాలి

ఇల్లెందురూరల్: మనిషి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు చివరి ప్రయత్నంగా శ్వాస అందేలా చేపట్టే ప్రక్రియే సీపీఆర్ విధానమని ఇల్లెందు 108 ఈఎంటీలు పూర్ణచందర్, రేణుకాదేవి, పైలెట్ సంజీవ అన్నారు. సుదిమళ్ల గిరిజన గురుకుల కళాశాలలో శుక్రవారం సీపీఆర్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ సీపీఆర్‌పై సంపూర్ణ అవగాహన ఉన్నవారు మాత్రమే ఈ ప్రయత్నం చేయాలని చెప్పారు. లేదంటే అసలుకే మోసం వస్తుందన్నారు. ప్రతీ ఒక్కరికీ ఈ విధానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా 108 ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం సీపీఆర్ విధానంపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అవసరం వచ్చినప్పుడు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించండి..



కలెక్టరట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని మొబైల్ అప్లికేషన్స్, ఎన్సీడీ రద్దు చేసి పని ఒత్తిడిని తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవటానికి, అంటు వ్యాధులు ప్రబలకుండా కావలసిన జాగ్రత్తలు తీసుకోవడానికి, ఆరోగ్యం మెరుగు పడటానికి కావలసిన ముందస్తు జాగ్రత్తలతో పాటు అవగాహన కల్పించడానికి, చిన్నపిల్లలకు టీకాలు వేయడానికి వారిని ఏఎన్ఎంలుగా ఉద్యోగంలోకి తీసుకున్నార న్నారు. మారుతున్న పరిస్థితులతో కొంతకాలంగా వారు చేసిన పనులకు రిపోర్టులను ఆన్‌లైన్ చేయాలని సూచించారని, ఒకటి రెండు యాప్‌లతో ప్రారంభమైన ఆ పనులు ప్రస్తుతం దాదాపు 14 మొబైల్ అప్లికేషన్లను పూర్తి చేయాల్సి వస్తోందన్నారు. ఎన్సీడీ లాంటి మొబైల్ అప్లికేషన్‌లలో 20 నుంచి 30 కాలమ్స్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందనీ, ముఖ్యంగా ఎన్‌సీడీ యాప్ అప్‌లోడ్‌కి సంబంధించి రాత్రి 11 గంటల నుంచి 1గంటల మధ్యలోనే ఓపెన్ అవుతుంటే ఎలా పని చేయాలని ప్రశ్నించారు. ఇక ఎన్‌సీడీ విషయానికొస్తే వారు ప్రతీ వ్యక్తిని స్క్రీనింగ్ చేయడంతో పాటు ఆ వ్యక్తికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఆన్‌లైన్ చేయాల్సి వస్తోందని, అంటే దాదాపు అర్ధగంట సమయం కేటాయించాల్సి వస్తోందన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు, అనారోగ్యానికి గురవుతున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, సుశీల, ఉమ, సుజాత, ధనలక్ష్మి, సీత, వేల్పుల మల్లికార్జున్, ఎండీ యూసుఫ్, సాయి, సారిక, ప్రియాంక పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవ నిరసన

జూలూరుపాడు: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేష్ కిషోర్ షూ విసిరి దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మగౌరవ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు చెంగల గురునాథం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడి అనాగరికమైందన్నారు. ఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ టి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దిబ్బెందుల సాయికుమార్, చాపలమడుగు నరసింహారావు, గార్లపాటి కృష్ణ, ఇసన్నపల్లి కల్యాణ్, జంగం నాగరాజు, వెంకట్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



జూలూరుపాడు: తహసీల్ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: మండల కేంద్రంలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా, మండల కార్యదర్శి తోటకూరి నరేష్ మాట్లాడుతూ పత్తి, వరి, ఇతర పంటల కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు చేపట్టి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. అరకొరగా చేతికి వస్తున్న పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఈసం శివ, ఇరప రాములు, బాలు, భూక్యా వీరు, వీరన్న పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పంట చేతికొచ్చినా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయలేదని, వెంటనే ప్రారంభించి రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని మాస్‌లైన్ డివిజన్ నాయకుడు ఆవుల కిరణ్, అఖిల భారత ఐక్య రైతు సంఘం మండల శాఖ అధ్యక్షుడు జూకంటి గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మాస్‌లైన్ ప్రతినిధి బృందం శుక్రవారం ఏఓ సతీష్‌కు వినతిపత్రం అందజేసింది. మాట్లాడుతూ కొమరారం, రొంపేడు, మాణిక్యారం, పోలారం, చల్లసముద్రం కేంద్రాలుగా కొనుగోలు కేంద్రాలను తక్షణం ప్రారంభించాలని కోరారు. కేంద్రాలు ప్రారంభించేలోగా వ్యాపారులు రైతులపై ఒత్తిడి చేసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో బోసు, బుర్ర రాఘవులు, రాంబాబు, అజ్మీర బిచ్చా పాల్గొన్నారు.

టేకులపల్లి: వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు భూక్యా లాలు నాయక్, మండల అధ్యక్షుడు మూడు హుస్సేన్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి సబ్ మార్కెట్ యార్డు నినాదాలు చేశారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి నీరుడు అన్నపూర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ మాను, బానోతు కృష్ణ, జగ్నా, మంచ, బాలాజీ, వీరు, మంగీలాల్ పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించండి..



మాట్లాడుతున్న హరిలాల్

ఇల్లెందురూరల్: గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్ల, ఆశ్రమ పాఠశాలల్లో 30 ఏళ్లుగా సేవలందిస్తున్న వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ డిమాండ్ చేశారు. రొంపేడు ఆశ్రమ పాఠశాల వద్ద వర్కర్ల సమ్మెకు శుక్రవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటైన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ ప్రకటించి పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. జీవో నెంబర్ 317 ప్రకారం ఉపాధ్యాయులను వారి స్థానికత ఆధారంగా బదిలీలు చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో వర్కర్లు సమ్మెలో ఉండటం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సమావేశంలో భాగ్యారావు, వెంకట్, సర్వేశ్వరరావు, శ్రీనివాసరావు, రమేష్, గుమ్మడి కవిత, మాన్సింగ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: హాస్టల్ డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నబీ, కృష్ణ, రామకళ, లక్ష్మణ్, రాజు, జయ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లతోనే బీసీలకు న్యాయం

బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం జరగనున్న బంద్‌ను జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు. బంద్ విజయవంతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో శుక్రవారం రాజకీయ పక్షాలు, బీసీ, సామాజిక, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే వారికి సముచిత న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ చట్టసభలు, రాష్ట్ర ప్రజలు సంపూర్ణంగా మద్దతు తెలుపుతుంటే కేంద్రానికి వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, చట్టసభలో బిల్లు ఆమోదానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తోందని ఆరోపించారు. బంద్‌కు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ, సీపీఎం, సీపీఐ, లంబాడీ హక్కుల పోరాట సమితి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్(కొత్తగూడెం): రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎన్డీ నాయకుడు మధు

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు..



ఇల్లెందు: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను



కొత్తగూడెంటౌన్: సూపర్‌బజార్ పాన్‌షాపులో తనిఖీ చేస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

ఇల్లెందు: యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని, గంజాయి సేవిస్తే మత్తుకు బానిసలుగా మారుతారని, గుట్కా, పాన్ మసాలా, అంబర్, ఖైనీ లాంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలోని దుకాణాలు, పాన్, కిరాణ షాపులను పోలీసులు యాంటీ నార్కొటిక్ జాగిలంతో సోదాలు చేశారు. ఈ సందర్భంగా జగదాంబ సెంటర్‌లో డీఎస్పీ మాట్లాడుతూ మత్తు, గుట్కా పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు దుర్భరంగా మారుతాయన్నారు. గంజాయి అమ్మితే ఏడాది జైలు తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు సీఐ టి.సురేష్, ఎస్ఐలు సూర్య, హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: డ్రగ్స్‌ను నివారించడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని డ్రగ్స్ మహమ్మారిని తరిమే చైతన్యం అందరిలో రావాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం, సూపర్‌బజార్, గణేష్‌టెంపుల్, రైతు బజార్లలో పాన్, కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం డ్రగ్స్‌పై చైతన్యం పోస్టర్లను అంటించి సమస్యలను స్థానికులకు అవగాహన కల్పించారు. సీఐలు ఎం.కరుణాకర్, ప్రతాప్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇల్లెందురూరల్: మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొమరారం ఎస్సై నాగుల్ మీరా అన్నారు. కొమరారం పోలీసుస్టేషన్ పరిధిలోని కిరాణ దుకాణాలలో శుక్రవారం తనిఖీ చేపట్టారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే నమోదు చేయనున్న కేసులపై అవగాహన కల్పించారు. ఇక నుంచి క్రమం తప్పకుండా తనిఖీలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

టేకులపల్లి: నిషేధిత గుట్కాలు, గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో టేకులపల్లి, బోడు ఎస్ఐలు, పోలీసులు శుక్రవారం మండల కేంద్రంలోని కిరాణ దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. ఎస్ఐలు అలకుంట రాజేందర్, పోలిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.